## క్లుప్తంగా...

### నేడు రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరం తెలంగాణ ప్రభుత్వం, కింగ్ కోటి ఆస్పత్రి, వైద్య విధాన పరిషత్ వారి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగుతుంన్నారు. రాజేంద్రనగర్ డిపో పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



అత్తాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నరేందర్‌గౌడ్ అన్నారు. సర్కిల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కచెరువు పరిసర ప్రాంతాలను పర్యవేక్షించామన్నారు. మల్కాచెరువు ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. అలాగే చెరువు ప్రాంతాల్లో సుందరీకరణ పనులను ముమ్మరం చేస్తున్నామన్నారు.

### జిల్లా బట్రాజు సంఘం మహిళా అధ్యక్షురాలిగా ప్రభావతి



మణికొండ: బట్రాజు సంఘం జిల్లా పశ్చిమ శాఖ మహిళా అధ్యక్షురాలిగా మణికొండకు చెందిన డాక్టర్ ప్రభావతి ఎన్నికయ్యారు. సోమవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. తన ఎంపిక సహకరించిన సభ్యులకు, శుభాకాంక్షలు తెలిపిన మిత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తమ కులంలోని మహిళల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

### గుంతను తప్పించబోయి..

**బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి**

శంషాబాద్ రూరల్: రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్కారం గ్రామానికి చెందిన కారుకొండ శంకరయ్య(50) ఈ నెల 25న రాత్రి బైక్‌పై కవేలిగూడ వెళ్లి తిరిగి వస్తుండగా మల్కారం శివారులో రహదారిపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### న్యాయవాదుల నిరసన



చార్మినార్: 1975 జూన్ 25 ఎమర్జెన్సీ డే సందర్భంగా సోమవారం హైకోర్టు గేటు ఎదుట భారత ప్రజా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. ప్రశ్నించే వారికి ప్రతిరోజూ ఎమర్జెన్సీ కాలం మారిపోయిందన్నారు. ఉపా లాంటి నల్ల చట్టాలను న్యాయవాదులపై పెట్టి కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అనంతరం న్యాయవాదులు నల్ల చట్టాలను రద్దు చేయాలి.. అడ్వొకేట్స్‌పై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.. ఉపా చట్టాని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వెంకన్న, సుశీల్ కుమార్, ప్రసాద్‌బాబు, సైదారావు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

### భూ కబ్జాకు యత్నించిన వ్యక్తుల రిమాండ్

మణికొండ: భూ కబ్జాకు యత్నించిన కొందరిని నార్సింగి పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కోకాపేట సర్వేనెంబర్ 166/4లోని భూమిలోకి పూసల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, గజ్జల కాంతం, మదన్‌గుప్తా, వై. ఒదేలు శనివారం తమ అనుచరులతో ప్రవేశించి సదరు భూమిలోని వాచ్‌మెన్ గది, షట్టర్స్, బాత్‌రూం, ప్రహరీగోడలను జేసీబీ, డోజర్లతో కూల్చిన విషయం తెలిసిందే. భూ యజమాని అరవింద్ అగర్వాల్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు రాగానే కబ్జాదారులు పారిపోయారు. వారిలో జి.అంజిత్, కె. శివాజీ, చిన్నరాజప్ప, పాశం శంకరయ్య, శంకర్ మహేందర్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు పోలీసులు తెలిపారు. మిగతా నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

# ఇలా అయితే ఎలా?

**కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. వేలాడుతున్న విద్యుత్ వైర్లు**

శేరిలింగంపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా అదేస్థాయిలో పెరిగింది. ఉన్నవాటికే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఇక వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. శేరిలింగంపల్లిలోని తారానగర్, బాపూనగర్, లింగంపల్లి, ప్రశాంత్‌నగర్, దూబే కాలనీ, జోయన్స్ టౌన్‌షిప్, సుదర్శన్‌నగర్‌- ఆలిండ్ హౌసింగ్ సొసైటీ, హుడా ట్రేడ్‌సెంటర్ కాలనీ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. పిల్లర్‌పై ఉంచడంతో విద్యుత్ వైర్లు యమపాశాల్లా వేలాడుతున్నాయి. ఈ వైర్ల వల్ల ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో బాటు వైర్లు వేలాడకుండా చేయాలి
- ఫ్యూజుబాక్సులకు మూతలు ఏర్పాటు చేయాలి
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకోకుండా చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దోయన్స్ టౌన్‌షిప్‌లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



శేరిలింగంపల్లి బాపూనగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద..



సుదర్శన్‌నగర్- ఆలిండ్ హౌసింగ్ సొసైటీ పార్కు పక్కన..



లింగంపల్లి రైల్వే స్టేషన్- 6వ ప్లాట్‌ఫారం రోడ్డుపై..



దూబే కాలనీ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ వైర్లు

## రోడ్డు సమస్యను పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నవీన్‌కుమార్ ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓంనగర్ కాలనీలో నెలకొన్న రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఓంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నవీన్ కుమార్‌ముదిరాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు సమస్యను పరిష్కరించడం లేదన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ రాక్‌చర్ప్ ప్రధాన రహదారిపై శనివారం నిరసన కార్యక్రమాన్ని సైతం చేట్టామన్నారు. రోజురోజుకూ సమస్య తీవ్రంగా పెరిగిపోతుండడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం ద్వారా వివరించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని 2–3 రోజుల్లో రోడ్డు పనులను ప్రాంరభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అమర్‌నాథ్, రామకృష్ణ, విద్య, బిజ్జు, హనుమంతరావు, శంకర్, శోభన్, వెంకటేష్ పాల్గొన్నారు.

## సీబీఐటీలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం




మణికొండ: మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో సోమవారం నిర్వహించారు. చైతన్య స్వాస్థ్య వెల్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో సే నోటు డ్రగ్స్ అనే నినాదాలు, ప్లకార్డులతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను ఉపయోగించే చాలా మంది వివక్షకు గురవుతున్నారని, అది వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి మరింత హాని కలిగిస్తుందని, వారికి అవసరమైన సహాయం మనమంతా అందించి వారిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ పీవీఆర్ రవీంద్రరెడ్డి, ప్రొఫెసర్ జగన్నాథరావు, ఎస్ఎల్ఎస్ రెడ్డి, పీఆర్‌ఓ జీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి




హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, విశ్వ విద్యాలయాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, విద్యార్థులకు తోపులాట జరగడంతో విద్యార్థులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెమిన్ గువెరా, కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమ్య తదితరులు పాల్గొన్నారు.



## ‘డ్రగ్ ఫ్రీ సొసైటీ’ లక్ష్యంగా సాగాలి



కేంద్రీయ విద్యాలయలో ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే కార్యక్రమంలో విద్యార్థులు వేసిన పెయింటింగ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్**

రాయదుర్గం: ‘డ్రగ్ ఫ్రీ సొసైటీ’ ఏర్పాటే లక్ష్యంగా సాగాలని కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ సూచించారు. డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ‘ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూజ్ డే’తో గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో ఎదురయ్యే అనర్థాలపై పెయింటింగ్స్, స్లోగన్స్, డిబేట్ తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్స్, స్లోగన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విద్యాలయ లైబ్రేరియన్ శివకృష్ణశాస్త్రి, పీజీటీ హిందీ అపర్ణా, ఇంగ్లిష్ పీజీటీ వందన మనహాస్ పర్యవేక్షించారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: వర్షానికి ఇల్లు కురవకుండా కప్పుపై ప్లాస్టిక్ కవర్ కప్పేందుకు యత్నిస్తున్న వ్యక్తికి పక్కనే ఉన్న టెలిఫోన్ స్తంభం నుంచి కరెంటు షాక్ తగలి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జూకల్ గ్రామానికి చెందిన కేశంపేట నరేష్(34) ఈనెల 25న ఇంటి వద్ద వర్షం కురుస్తుండడంతో పైకప్పు కురుస్తుందని ప్లాస్టిక్ కవర్ కప్పేందుకు టెలిఫోన్ స్తంభం సహాయంతో పైకి ఎక్కాడు. ఈ సమయంలో కరెంటు లేకపోగా.. కిందకు దిగేటప్పుడు స్తంభాన్ని పట్టుకున్న సమయంలో కరెంటు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రత్యేక పూజలు



లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవాలతో పాటు నగరంలో, రాష్ట్రంలో బోనాలు విజయవంతంగా పూర్తి కావాలంటూ గండిమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్‌యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, నాయకులు ఈ పూజలు జరిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా వివిధ అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గండి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన పూజల్లో వసంత్‌రెడ్డి, కార్తీక్, శ్రీనివాస్ ఉన్నారు.

### విజయశాంతికి ‘అమ్మకు అక్షర నైవేద్యం’ పుస్తకం అందజేత



విజయశాంతికి పుస్తకాన్ని అందజేస్తున్న అరవింద్ గౌడ్, వెంకటేష్

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో విడదీయరాని అనుబంధమున్న సినీనటి విజయశాంతికి ‘అమ్మకు అక్షర నైవేద్యం’ పుస్తకాన్ని అందజేశారు. శ్రీ మహంకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరవింద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ సోమవారం బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో కలిసి పుస్తకాన్ని అందజేశారు. తెలంగాణ సంస్కృతి, బోనాల విశిష్టత, లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారి మహత్యాన్ని వివరిస్తూ కవులు, పండితులు రాసిన 526 కవితలతో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని ఆమె కొనియాడారు.

## అర్హులకు ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి



ఆర్ఐ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

శేరిలింగంపల్లి: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలని తహశీల్దార్‌ను శేరిలింగంపల్లి మండల ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు సోమవారం కోరారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని నిరుపేదలు డబుల్ ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్నారని మండల పరిధిలోని గుల్ మొహర్‌పార్కు కాలనీలో నిర్మాణాలు పూర్తి అయినందున అర్హులైన వారికి వాటిని కేటాయించాలన్నారు. అదే విధంగా మండల పరిధిలోని మియాపూర్, గోపన్‌పల్లి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాల పాలవుతోందని, ఆయా భూములను ఇళ్ళులేని వారికి 60 గజాల చొప్పున కేటాయించాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కొంగరి కృష్ణ, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు శ్రీనివాస్, శంకర్, సేవ్యా రాథోడ్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి కేటీఆర్‌ను కలిసిన సలావుద్దీన్ లోధీ



చార్మినార్: మంత్రి కేటీఆర్‌ను సోమవారం బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గంలో అమలవుతున్న పలు సంక్షేమ పథకాలను ఆయనకు వివరించారు. పార్టీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలను ఆయనకు తెలిపారు.

## అన్ని వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి



కిస్మత్‌పూర్‌లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బండ్లగూడ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు కొండె మహేష్‌యాదవ్ వెల్లడించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లో కేంద్ర ప్రథకాలపైన అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంటింటికీ బీజేపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందన్నారు. కన్వీనర్లు మల్లేష్‌యాదవ్, మహాలింగంగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, శేఖర్‌ముదిరాజ్, కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్ పాల్గొన్నారు.

**ఇంటింటికీ బీజేపీ పాలన విజయాలు**

మణికొండ: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాలన విజయాలను నాయకులు ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మణికొండ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బీరప్ప ఆధ్వర్యంలో శివపురి కాలనీ, సత్యమ్మగార్డన్ కాలనీలు, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో కోకాపేటలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఇందిర మాట్లాడుతూ.. 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి చేపట్టిన పథకాలను వివరిస్తే ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. మణికొండ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు లక్ష్మీరాములు, నాయకులు ఆనంద్‌రావు, నర్సింహాచారి, నార్సింగి మున్సిపాలిటీ నాయకులు నాగేష్‌యాదవ్, బుచ్చిరెడ్డి, శివరాజు, సురేందర్, శేఖర్, రాజుయాదవ్, చెన్నయ్య పాల్గొన్నారు.



తొండుపల్లిలో ప్రచారం చేస్తున్న ప్రేమ్‌రాజ్, శ్రీధర్ తదితరులు

**తొండుపల్లిలో..**

శంషాబాద్: ప్రధాని మోదీ ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. బీజేపీ చేపడుతున్న మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ నరేంద్రమోదీ పాలన ప్రచార కార్యక్రమాన్ని తొండుపల్లిలో సోమవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో కేంద్రం సాధించిన ప్రగతి స్వాతంత్య్ర భారత దేశంలో మునుపెన్నడు జరగలేదన్నారు. బీజేవైఎం నాయకులు మహేందర్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో ఇంటింటికీ బీజేపీలో పాల్గొన్న నాయకులు